
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు 3

శుక్రవారం 20 జూన్ 2025

డీఎస్సీ పరీక్షలకు 40 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో జరుగుతున్న డీఎస్సీ పరీక్షల్లో గురువారం రెండు సెషన్స్‌లో నిర్వహించిన పరీక్షలకు 40 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో మొదటి సెషన్‌లో నిర్వహించిన పీజీటీ (బయోసైన్స్), ఎస్‌జీటీ పరీక్షలకు మొత్తం 882మంది అభ్యర్థులు హాజరు కావాల్సి వుండగా 27 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో నిర్వహించిన ఎస్‌ఏ-సోషల్ పరీక్షకు 914 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి వుండగా 13మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు జూలై 15వ తేదీలోపు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పది, ఇంటర్ అర్హతతో మెకానిక్, డీజిల్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషనింగ్ తదితర కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జూలై 17 వరకు నంద్యాల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన, 21వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

డీజీ మహాలక్ష్మి

- మీసేవా తరహాలో కేంద్రాల ఏర్పాటు
- డ్వాక్రా మహిళలకు నిర్వహణ బాధ్యతలు
- నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేలు ఆదాయం

4

యోగాంధ్రలో పాల్గొనండి

జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజకుమారి పిలుపు



ఆశల సాగయ్యేనా..?

- దోబుచులాడుతున్న మేఘాలు
- మేలో మురిపించేను
- జూన్‌లో జాడే లేని వరుణుడు
- వెయ్యి కళ్లతో ఎదురుచూపులు
- ముందుకు సాగని ఖరీఫ్
- అరకొరగా విత్తనాల సరఫరా

ఆరుగాలం కష్టపడే అన్నదాతకు కష్టాలు తీరడం లేదు. ప్రతి ఏటా అతి, అనావృష్టి, ప్రకృతి వైపరీత్యాలతో పాట్లు తప్పడం లేదు. ఇలాంటి తరుణంలో మే నెలలోనే వరుణుడు మురిపించాడు. సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షాలు కురిశాయి. రైతు కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎంతో ఆశతో ఖరీఫ్ ముందస్తు సాగుకు సిద్ధమయ్యాడు. పొలం దున్ని విత్తనాలు వేసేందుకు పనులు ప్రారంభించాడు. జూన్ నెల రానే వచ్చింది. వరుణుడు ముఖం చాటేశాడు. అన్నదాతతో దోబుచులాడటం మొదలెట్టాడు. వాన జాడ అనేదే లేకుండా పోయింది. వెయ్యి కళ్లతో రైతన్న ఆకాశం వైపు ఎదురుచూపులు చూస్తున్నారు. వరుణదేవా కరుణించవయ్యా అంటూ వేడుకుంటున్నారు. కాగా జిల్లాకు విత్తనాల సరఫరా కూడా అరకొర ఉందని రైతులు చెబుతున్నారు.



చాగలమర్రి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత కోటి ఆశలతో సాగుకు సిద్ధమయ్యాడు. మే నెలలో వానలు మురిపించాయి. ఇక ఖరీఫ్ సాగుకు ఎలాంటి ఆటంకం లేదనుకున్న తరుణంలో జూన్ మాసంలో వరుణుడు జాడ లేకుండా పోయాడు. మేఘాలు రైతన్నలతో దోబుచులాడుతుంటాయి. వర్షాలు కురుస్తాయని వెయ్యి కళ్లతో అన్నదాతలు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈఏడాది ఖరీఫ్‌లో 2.37 లక్షల హెక్టార్లలో వరి, పత్తి, మినుము, కంది, మొక్కజొన్న, ఆముదం, వేరుశనగ, ఉల్లి, కొర్ర, బెండ తదితర పంటల సాగు లక్ష్యం. గత ఏడాది వివిధ పంటల్లో తీవ్ర నష్టాలు చవి చూసిన రైతులు ఆ నష్టాన్ని ఈ ఏడాది పూడ్చుకునేందుకు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఆయా మండలాల పరిధిలో ఇప్పటికే పత్తి, మొక్కజొన్న విత్తన పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం జీలుగ విత్తనాలు మాత్రమే సబ్సిడీపై సరఫరా చేస్తోంది. కంది, మినుము తదితర విత్తనాల పంపిణీపై దృష్టి సారించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి సాయం కోసం..

ఖరీఫ్ రైతులకు పెట్టుబడి సమస్య ప్రధానంగా ఉంది. పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. బ్యాంకులు రైతులకు అవసరమైన పంట రుణాలివ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. 2025-26లో వ్యవసాయ రంగానికి ఉమ్మడి జిల్లాలో రూ.16వేల కోట్ల రుణాలు పంపిణీ చేయాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు పాత రుణాలను రెన్యువల్ చేయడం మినహా కొత్తరుణాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం స్పందించి బ్యాంకుల రుణాలతో పాటు పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

గతేడాది నష్టపోయాం



గత ఏడాది ఖరీఫ్‌లో అధిక వర్షాలు, తెగుళ్ల, పంట చేతికందే తరుణంలో తుఫాన్ ప్రభావంతో మిరప, మొక్కజొన్న పంట దిగుబడులు తగ్గిపోయాయి. ఈఏడాది మే నెల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ కలిసి వస్తుందని భావించా. ఈ ఏడాది నాలుగెకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశా.

● శ్రీరామ్‌నాయక్, రైతు, కేపీ తండా, చాగలమర్రి

జిల్లాలో 2.37 లక్షల హెక్టార్ల సాగు లక్ష్యం

ఖరీఫ్‌లో 2.37 లక్షల హెక్టార్లలో పంటల సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్రమే పలు రకాల పంటలు సాగయ్యాయి. జిల్లాలో వరి 65,255 హెక్టార్లు, మొక్కజొన్న 50,515 హెక్టార్లు, కంది 36,243, పత్తి 18,827, మిరప 12,715, వేరుశనగ 11,993, మినుము 9,451, ఉల్లి 4,240, కొర్ర 1,858, బెండ 3,699, ఆముదం 2,921, సోయా చిక్కుడు 4,176, పెసర 5,017, ఇతర పంటలు 1.19 లక్షలు హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉంది. దీంతో పాటు ఉద్యానవన, ఇతర పంటలు సాగు అవుతాయి.

కరుణించని వరుణుడు ..

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వరుణుడు కరుణించలేదు. ఏప్రిల్, మే నెలలో సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదైంది. జూన్‌లో అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధం చేశారు. బోర్ల కింద మాత్రమే పత్తి, మినుము, మొక్కజొన్న, మినుము పంటలు సాగు చేశారు. జూన్ నెలలో ఇప్పటి వరకు సరైన వర్షం పాతం నమోదు కాకపోవడంతో రైతులు రైతులు వర్షం కోసం ఎదురు చూస్తుండగా మరి కొందరు రైతులు వర్షం వస్తుందన్న ఆశతో విత్తన పనుల్లో నిమగ్నమయ్యారు.

అరకొరగా విత్తనాల సరఫరా..

జిల్లాలో అరకొరగా విత్తనాలను కేటాయించారు. జిల్లాకు 892 క్వింటాళ్ల కందులు, 25 క్వింటాళ్ల మినుములు, 10 క్వింటాళ్ల పెసర, 70 క్వింటాళ్ల కొర్ర, 1,122 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరు చేశారు. ఆయా పంటలకు సంబంధించి వేలాది ఎకరాల్లో పంటల సాగు సాధారణ విస్తీర్ణం కాగా అతి తక్కువ క్వింటాళ్ల విత్తన కేటాయింపులు చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జీలుగ విత్తనాలను కేవలం శిరివెళ్ల, రుద్రవరం మండలాలకు మాత్రమే కేటాయించారు. ఆయా మండలాలకు జీలుగ విత్తనాలు కేటాయించక పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎనిమిది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా



ఈ ఏడాది ఎనిమిది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. గత ఏడాది నష్టాన్ని పూడ్చుకునేందుకు ముందస్తుగా పంట వేశా. వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. సరైన వర్షాలు కురిస్తే గతేడాది మిగిల్చిన నష్టాన్ని ఈ ఏడాది గట్టెక్కుతాం.

● ప్రభాకర్‌రెడ్డి, రైతు, మూడురాళ్లపల్లె

తవ్వకాల్లో మాయ..!

హంద్రీనీవా కాలువ తవ్వకాల్లో జరిగిన అక్రమాల పాపం పదమూడేళ్లుగా వెంటాడుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి అనంతపురం జిల్లాకు చెందిన మంత్రి రఘువీరారెడ్డి కృష్ణా జలాలు ఆ జిల్లాలకు తీసుకెళ్లాలనే లక్ష్యంగా పాదయాత్ర చేశారు. ఎలాగైనా ట్రైల్‌రన్ విజయవంతం చేయాలని కాలువ తవ్వకాలు, మట్టి పనులు హడావుడిగా చేపట్టారు. సందట్లో సడేమియా అన్నట్లు రూ.కోట్లు విలువైన మట్టి పనులు (ఎర్త్‌వర్క్) చేయకుండానే చేసినట్లు కాంట్రాక్ట్ సంస్థ బిల్లులు స్వాహా చేసింది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు కాలువ విస్తరణకు శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థకు అనుమానం వచ్చి అభ్యంతరం పెట్టడంతో ఈ భాగోతం వెలుగులోకి వచ్చింది. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మట్టి పనుల్లో అక్రమాలు నిజమేనని నిగ్గు తేల్చింది. సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ నుంచి రూ.6 కోట్లు డిపాజిట్ చేయించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హంద్రీనీవా విస్తరణకు ఏమాత్రం అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టారు. పదమూడేళ్ల క్రితం కాంట్రాక్ట్ సంస్థ చేసిన అక్రమాలు పాపం ఫలితం.. తాజాగా ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ఖజానాపై మరో రూ.6 కోట్లపైగా అదనపు భారం తప్పదని నిపుణులు అంటున్నారు.

కొనసాగుతున్న హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు



- చేయని మట్టి పనులకు బిల్లులు
- విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
- రూ.6 కోట్లు డిపాజిట్ చేసిన కాంట్రాక్ట సంస్థ
- హంద్రీనీవా కాలువ విస్తరణకు అడ్డంకులు లేకుండా చర్యలు
- ఖజానాపై తప్పని అదనపు భారం

కర్నూలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎగువన కృష్ణా జలాలు ఎత్తిపోసి రాయలసీమ ప్రాంతానికి మళ్లించడం ద్వారా కరువు పల్లెసీమలను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 1989లో ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం (హెచ్ఎన్ఎస్ఎస్) శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లా హంద్రీ, చిత్తూరు జిల్లాలోని నదులు అనుసంధానం చేయడంతో భాగంగానే హంద్రీ-నీవా ప్రాజెక్టుకు అప్పటి సాగునీటి నిపుణులు, ప్రముఖ ఇంజనీరు డాక్టర్ కుడితిపూడి శ్రీరామకృష్ణయ్య రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నందికొట్కూరు మండలం మల్యాల వద్ద ఎన్టీఆర్ పునాది రాయి వేశారు. 40 టీఎంసీలు కృష్ణా మిగులు జలాలు ఎత్తిపోసి కరువు సీమలో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 6.025 లక్షల ఎకరాల్లో సాగునీరు అందించాలనే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తి చేయడంలో ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి నలుగురు ముఖ్యమంత్రుల కృషి ఉంది. 2012 నవంబరులో ట్రైల్‌రన్ విజయవంతం చేశారు. అప్పటి నుంచి ఏటేటా కృష్ణా జలాలు ఎత్తిపోస్తున్నారు. ఆ సమయంలో కాల్వ తవ్వకాల్లో భాగంగా చేపట్టిన మట్టి పనుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఫేజ్-1లో భాగంగా చేపట్టిన ప్యాకేజీ-28, ప్యాకేజీ-28ఏ పరిధిలో ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ చేయని మట్టిపనులకు చేసినట్లుగా రికార్డుల్లో చూపి బిల్లులు స్వాహా చేసింది.

ఆరేళ్ల తర్వాత వెలుగులోకి

హంద్రీనీవా కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు కాగా.. 1,850 నుంచి 2 వేల క్యూసెక్కులకు మించి ఎత్తిపోయలేని పరిస్థితి ఉంది. చిత్తూరు జిల్లా కుప్పంకు కృష్ణా జలాలు తీసుకువెళ్లాలనే లక్ష్యంగా 2017-18లో అప్పటి సీఎం చంద్రబాబు 3,850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి కాలువను విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఫేజ్-1 కింద శ్రీశైలం డ్యాం ఫోర్‌షోర్ ఏరియాలో మల్యాల లిఫ్ట్ పంప్‌హౌస్ వరకు 4.806 కిలోమీటర్లు అప్రోచ్ ఛానల్, 0/0 కి.మీలు నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్ వరకు 216.30 కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు రూ.1,050 కోట్లతో చేపట్టారు. ప్యాకేజీ-1 కింద 0/0 నుంచి 88 కిలోమీటర్ల వరకు, ప్యాకేజీ-2 కింద 88 కి.మీల నుంచి 216.30 కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు చేపట్టారు.

మిగతా 4వ పేజీలో

పాఠశాల విలీనం వద్దే..వద్దు..

- జాతీయ రహదారిపై మండ్లెం విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా

జూపాడుబంగ్లా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండ్లెం గ్రామంలోని స్పెషల్ పాఠశాల విలీనాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్డెక్కారు. మండ్లెంలోని పాఠశాలను రహదారి సమీపంలో ఉన్న మెయిన్ పాఠశాలలో విలీనం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విలీనాన్ని వ్యతిరేకిస్తూ గురువారం జాతీయ రహదారిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాఠశాలను విలీనం చేశారని, అప్పట్లో ఆందోళనలు చేశామన్నారు. యథాస్థానంలోనే పాఠశాలను కొనసాగిస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఇక్కడే ఉండాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జాతీయ రహదారిపై గంటపాటు ధర్నా చేపట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు రంగప్రవేశం సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించి ఆందోళనకారులకు సర్దిచెప్పారు.



మండ్లెం జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి గురువారం తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయాలు, ఉపకరణాలు, సహాయ పరికరాలు ఉచితంగా అందించేందుకు జిల్లాలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేకశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి చొరవతో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఏడీఐపీ పథకం కింద ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న నంద్యాలలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో, 28న నందికొట్కూరు మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 1న ఆళ్లగడ్డలో, జూలై 4న ఆత్మకూరులో, జూలై 8న బనగానపల్లె, 11న డోన్, 15న పాణ్యంలోని మండల పరిషత్ కార్యాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక నిపుణులను తక్షణమే నియమించాలని ఏఎల్ఐఎంసీవో ప్రతినిధులకు సూచించినట్లు ఆమె పేర్కొన్నారు.

23న కలెక్టరేట్ ముట్టడికి పిలుపు



ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నంద్యాల నూనెపల్లె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న కలెక్టరేట్ ముట్టడి చేపడతామని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ వెల్లడించింది. ఈ మేరకు జిల్లాలోని అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీబారాణి, నిర్మల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.మద్దు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో పీడీ లీలావతికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు ఎఫ్ఆర్ఎస్ రద్దుచేయాలని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ట్యాబులు ఇవ్వాలని కోరారు.



జలాశయంలోకి చేరిన నీరు

శ్రీశైలానికి పెరిగిన నీటి మట్టం

నంద్యాల (శ్రీశైలం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నీలం సంజీవరెడ్డి సాగర్ ప్రాజెక్ట్ (శ్రీశైలం రిజర్వాయర్)లో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలానికి వరద పోటెత్తుతోంది. దీంతో ప్రతి రోజు 30 వేల క్యూసెక్కులకు పైగానే శ్రీశైలం జలాశయంలోకి వరద వచ్చి చేరుతోంది. గురువారం సాయంత్రానికి 42,205 క్యూసెక్కుల మేర వరద జలాశయంలోకి వచ్చి చేరింది. అదేవిధంగా రెండు పవర్ హౌస్‌ల్లోని విద్యుత్ ఉత్పాదన తాత్కాలికంగా నిలిపివేశారు. డ్యాంలో 73.9870 టీఎంసీల నీటి లభ్యత ఉండగా.. డ్యాం నీటి మట్టం 847.10 అడుగులకు చేరుకుంది.

సూర్యపయనం.. నయనం..!



కన్నులతో చూడాలే కానీ ప్రకృతిలో ప్రతీది అందమే. ఆకాశంలో హరివిల్లు, కమ్ముకొస్తున్న మేఘాలు, సూర్యకిరణాలే కాదు.. సంధ్యావేళ సూర్యాస్తమయం కూడా ఓ అందమైన అనుభూతే. నిత్యం మన కళ్లకు కనువిందు కల్పించే సహజసిద్ధమైన ప్రకృతి దృశ్యకావ్యమిది. ప్రశాంతంగా ప్రవహించే తుంగభద్ర నది, అక్కడి పూల మొక్కలపై వాలిపోయే తుమ్మెదలు.. ఆకాశంలో మబ్బులు కమ్ముతూ సిందూర వర్ణంలో పయనమవుతున్న సూర్యుడు... ఇవన్నీ పైసా ఖర్చు లేకుండా చూసే అద్భుత దృశ్యాలే. సాయంత్రం ఆరు గంటల సమయంలో కర్నూలు నగర శివారులోని సంకల్‌బాగ్‌లో తుంగభద్ర తీరాన అలా కూర్చుంటే ఈ అందాలన్నీ మన కన్నుల సొంతమే.

- కర్నూలు రూరల్ (ఆంధ్రజ్యోతి)
ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు



మేఘమా.. ఓ మేఘమా..!

ప్రకృతిని నమ్ముకున్న రైతన్న మళ్లీ సిద్ధమయ్యాడు. పొలాన్ని దుక్కి దున్ని చేసి విత్తునాటి సిద్ధంగా ఉంచాడు. ఖరీఫ్‌లో ప్రకృతి కూడా సహకరించడంతో అన్నదాత కాస్త ముందుగానే పొలం పనుల్లో బిజీగా మారాడు. ఈ క్రమంలో కొందరు విత్తులు వేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. చిరుగాలి వేయంగా చక్కగా కురవాలని, మది పులకించంగా ముచ్చటగా కురవాలంటూ వానదేవుడిని వేడుకుంటున్నారు. చాగలమర్రి మండలం చింతలచెరువులో గురువారం కమ్ముకున్న మేఘాలు ఇలా కనిపించాయి.

- చాగలమర్రి (ఆంధ్రజ్యోతి)

యోగాంధ్రలో పాల్గొనండి

కలెక్టర్ రాజకుమారి పిలుపు



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల నూనెపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరిగే యోగాంధ్ర వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ రాజకుమారి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె గురువారం సీఎం చంద్రబాబుతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆమె జేసీ విష్ణు చరణ్‌తో కలసి మాట్లాడారు. శనివారం నంద్యాలలోని టెక్కె మార్కెట్ యార్డులో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఉద యం 6:45గంటల నుంచి 8 గంటల వరకు జరిగే కార్యక్రమంలో అధికా రులు, సిబ్బంది, ప్రజలు చురుగ్గా పాల్గొనాలన్నారు. యోగాంధ్ర యాప్‌లో నమోదైన దాదాపు 8లక్షలమంది పౌరులు కార్యక్రమంలో భాగ స్వాము లవుతున్నారన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై జిల్లా వ్యాప్తంగా ముఖ్య అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఆర్‌ఎల్‌వీడీ కెమెరాలతో 1,170 చలానాలు

కర్నూలు క్రైం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నిబంధన లు అతిక్రమించిన 1170 వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు చలానాలు విధించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అతిక్రమించే వారిపై కొరడా ఝుళిపించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఇటీవల పలు కూడళ్లలో ఆర్‌ఎల్‌వీడీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేసినా, రాంగ్ రూట్‌లో వచ్చినా ఈ కెమెరాలు ఆటోమేటిక్‌గా చలానాలు వే స్తాయి. ఈనెల 10వ తేదీ నుంచి నేటి వరకు సుమారు 1170 వాహనాలపై చలానాలు పడినట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

మగ్గంతో బతుకు భరోసా

- స్వయం ఉపాధికి బాటలు
- శిక్షణ పొందుతున్న మహిళలు



మగ్గంపై శిక్షణ పొందుతున్న మహిళలు

ఓర్వకల్లు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పొదుపులక్ష్మి ఐక్య సంఘం ఆధ్వర్యంలో మహిళలకు మగ్గంలో శిక్షణ ఇస్తూ బతుకు భరోసా కల్పిస్తున్నారు. ఓర్వకల్లులోని మండల పొదుపులక్ష్మి సమాఖ్య భవనంలో దాదాపు 54 మంది మహిళలకు 3 నెలల పాటు మగ్గంపై శిక్షణ నైపుణ్యాలు నేర్పిస్తూ వారి భవితకు పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం బాటలు వేస్తుంది. మహిళలకు మగ్గం శిక్షణ ఇచ్చేందుకు కోల్‌కత్తాకు చెందిన తాలు, కర్నూలు చెందిన ప్రశాంతి, అనుభవం ఉన్న శిక్షకులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన పొదుపు మహిళలు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. చీరలు, బ్లౌజులకు ప్రత్యేక డిజైన్లు చేసి తక్కువ ధరకే చెల్లించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొద్దిరోజుల పాటు మగ్గం వర్కులు చేసేలా సాధన చేస్తారు. అనంతరం నేర్చుకోవడం.. అయితే ఇక్కడ మహిళలు నెల గడువు లోపే నేర్చుకుంటున్నారు. న్నారు.



మహిళలకు శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు



శిక్షణలో పొదుపు మహిళల గ్రూపు

మహిళలు శిక్షణలో నైపుణ్యాన్ని..



ఓర్వకల్లు పొదుపు మహిళలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. వారికి మగ్గంపై శిక్షణ ఇవ్వడం అదృష్టంగా భావిస్తా. కోల్‌కత్తా నుంచి ఇక్కడకు వచ్చి శిక్షణ ఇస్తున్నాను. మహిళలు శిక్షణలో నైపుణ్యాన్ని పొందుతున్నారు.

● తాలు, శిక్షకుడు, కోల్‌కత్తా

జీవనోపాధి పొందుతాం



మగ్గం శిక్షణలో 54 మంది శిక్షణను పొందుతున్నాం. ఈ శిక్షణలో మగ్గం వర్కుపై నెల రోజుల్లోనే చాలా మెలకువలు నేర్పించారు. కొత్త కొత్త డిజైన్లు ఎలా చేయాలో తెలుసుకున్నాం. ఇంటి వద్ద నుంచే పనిచేసి డబ్బులు సంపాదించుకోవచ్చు.

● నెమలి మమత, నన్నూరు



మగ్గం శిక్షణను పరిశీలిస్తున్న పొదుపులక్ష్మి మండల సమాఖ్య గౌరవ సలహాదారురాలు

మహిళలు ఆర్థికంగా బలపడేందుకు..




పొదుపు మహిళలు ఆర్థికంగా బలపడేందుకే మగ్గం వర్క్‌లో శిక్షణ ఇస్తున్నాం. పొదుపులక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మగ్గం శిక్షణకు కావాల్సిన మెటీరియల్ సమకూర్చింది. మూడు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున 30నుంచి 50 మంది మహిళలకు శిక్షణ ఇస్తాం. రకరకాల డిజైన్లు మహిళలు నేర్చుకుంటున్నారు. మగ్గం శిక్షణ నిపుణులను ఇద్దరిని నియమించాం.

- విజయభారతి, పొదుపులక్ష్మి మండల సమాఖ్య గౌరవ సలహాదారురాలు

డీజీ మహాలక్ష్మి

- మీసేవా తరహాలో కేంద్రాల ఏర్పాటు
- డ్వాక్రా మహిళలకు నిర్వహణ బాధ్యతలు
- నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేలు ఆదాయం





నంద్యాల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతోంది. తాజాగా 'డీజీ లక్ష్మి' అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పట్టణాల పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో డీజీ లక్ష్మి ఆటమ్ కియోస్క్ ఏర్పాటు చేయిస్తోంది. అందులో భాగంగా స్లమ్ లెవల్ సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్) పరిధిలో ఒక కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ను సమాఖ్య (ఎస్ఎల్ఎస్)ల్లో కామన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పొదుపు సంఘాల్లో సభ్యులై ఉండి. డిగ్రీ విద్యార్హతతో పాటు కంప్యూటర్ నైపుణ్యం ఉన్న వారిని ఎంపిక చేస్తారు. వీరికి శిక్షణ ఇస్తారు. ఒక స్లమ్ లెవల్ సమాఖ్య పరిధిలో 300 మంది పేద కుటుంబాలకు ఒక కియోస్క్ సెంటర్ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సేవలు ఇలా...

ప్రస్తుతం మీసేవ కేంద్రాల్లో పొందే సేవలన్నీ ఇక్కడ లభిస్తాయి. రేషన్‌కార్డు, పాస్‌పోర్టు, జనన, మరణ, ధ్రువపత్రాలు, ఓటరుకార్డు, బ్యాంకు ఖాతా తెరిపించడం నగదు డిపాజిట్ చేయడం విత్‌డ్రా, బ్యాంకింగ్ సేవలతో పాటు అన్ని రకాల ప్రభుత్వ శాఖల సేవలు అందుబాటులో ఉంటాయి. అసంఘటిత కార్మికుల ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ కోసం కార్మిక సంక్షేమశాఖతో, మెప్మా అవగాహన ఒప్పందం చేసుకోనుంది. ఆస్తి, తాగునీటి పన్నుల రుసుం, ప్రజల నుంచి వసూలు చేసేలా పురపాలకశాఖతోనూ ఒప్పందం చేసుకోనున్నారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలపై వాయిదాలు, విద్యుత్ బిల్లులు కియోస్క్ సెంటర్ల ద్వారా చెల్లించేలా కసరత్తు చేస్తున్నారు.

ఒక్కో కేంద్రంలో ముగ్గురికి ఉపాధి

డీజీ లక్ష్మి సీఎస్‌సీ కేంద్రాల ఏర్పాటుతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఉపాధి కల్పించనున్నారు.



నెలకొల్పుతారు. ఇందుకు ఈ-గవర్నన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ తోడ్పాటు అందిస్తుంది. ఆయా కేంద్రాల మీసేవ కేంద్రాల మాదిరిగానే ఇవి పని చేస్తాయి. ఒక్కో కేంద్రంలో ముగ్గురు డ్వాక్రా మహిళలు ఉపాధి పొందుతారు. వారు నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం పొందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

మహిళలకు ఎంతో ఉపయోగకరం



డీజీ లక్ష్మి మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వారు చాలా వరకు ఆదాయం తెచ్చుకోవచ్చు. వారి సృజనాత్మకతను పెంచుకోవచ్చు. ఆర్థికంగా బలపడేందుకు సువర్ణ అవకాశం. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- నాగశివలీలా, మెప్మా పీడీ నంద్యాల జిల్లా



ఒక్కో కేంద్రంలో ముగ్గురు డ్వాక్రా మహిళలు ఉపాధి పొందే వీలుంది. నెలకు రూ.30వరకు ఆదాయం పొందవచ్చునని అంచనా వేస్తున్నారు. 21 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల మధ్య వారు ఇందుకు అర్హులు. ఇప్పటికే మెప్మా సీఎస్సీ సేవలు అందించే ఈ గవర్నెర్స్‌తో ఎంవోయూ చేసు కుంది. డీజీ లక్ష్మి సేవలకు ఎంపికైన మహిళకు రూ.2లక్షల వరకు రుణం ఇస్తారు. అలాగే కంప్యూటర్‌తో పాటు ఇతర పరికరాలు, సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు అవకా శమిస్తారు. మిగిలిన సొమ్ముతో సీఎస్సీ నిర్వహించే చోటే ఏదైనా వ్యాపారం కూడా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

జిల్లాలో 323 కేంద్రాల ఏర్పాటు

నంద్యాలల్లోని జిల్లాలోని ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, డోన్, బేతంచెర్ల వరకు స్లమ్ లెవల్

నంద్యాల జిల్లా వివరాలు ఇలా...

పట్టణం	స్లమ్ సమాఖ్యలు	గుర్తింపు పొందిన డిజీ లక్ష్మిలు	సీఎస్‌సీ లాగిన్ పూర్తయినవి
నంద్యాల	138	93	35
నందికొట్కూర్	40	20	15
బేతంచెర్ల	22	11	05
డోన్	46	26	12
ఆళ్లగడ్డ	41	34	13
ఆత్మకూరు	36	05	02

కొత్తిమీర పతనం

మడి ధర రూ. 100



గోనెగండ్లలో సాగుచేసిన కొత్తిమీర

గోనెగండ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కొత్తిమీర ధర ఒక్కసారిగా పడిపోయింది. దీంతో కొత్తి మీర పంటను సాగుచేసిన రైతు విలవిల లాడుతున్నాడు. నాలుగు రోజుల్లో కొత్తి మీర మడి ధర రూ. 1000 నుంచి రూ.100కు పడిపోయింది. ఒక్కసారిగా ధర పడిపోవడంతో రైతులు, వ్యాపారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు డివిజన్‌లో చాలా మంది రైతులు తక్కువ కాలంలో పంట చేతికి అందుతుందనే కారణంగా ఎక్కువ మంది రైతులు కొత్తిమీరను సాగు చేశారు. డివిజన్ లో దాదాపు 3000 ఎకరాలలో సాగు చేసినట్లు తెలుస్తుంది. పెళ్లిళ్ల సీజన్ కూడా ముగియడంతో కొనుగోలు చేసేవారు కూడా తగ్గిపోయారు. ఎకరం కొత్తిమీర సాగుకు రూ. 25 వేల నుంచి రూ. 30వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఒక ఎకరంలో 200 నుంచి 220 మడులు వేస్తారు. కేవలం మడి ధర రూ. 100 పలుకుతుండటంతో కొంత మంది రైతులు కొత్తి మీర పంట వైపు కూడా చూడటం లేదు. గోనెగండ్ల మండలంలో ప్రస్తుతం బావులు, బోర్ల దగ్గర దాదాపు 1000 ఎకరాలలో కొత్తిమీర పంటను సాగు చేశారు. ఏదిఏమైనా ప్రస్తుతం కొత్తి మీర పంట సాగు చేసుకున్న రైతులు మాత్రం పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


తవ్వకాల్లో మాయ..!

3వ పేజీ తరువాయి

ప్యాకేజీ-2 విస్తరణ పనులు పనులు దక్కించుకున్న హిందుస్తాన్ ఇంజనీరింగ్ సొసైటీ (హెచ్‌ఈఎస్) సంస్థ సర్వే చేయగా.. దేవనకొండ, పత్తికొండ మండలాల్లో నున్సురాళ్ల, నల్లచెలిమిల, పందికోన గ్రామాల వద్ద హంద్రీనీవా కాలువ 100-105 కిలోమీటర్ల మధ్యలో గతంలో పనులు చేసిన ప్యాకేజీ-28, ప్యాకేజీ-28ఏ కాంట్రాక్ట్ సంస్థ అక్రమాలకు పాల్పడి చేయని మట్టి పనులు చేసినట్లుగా రికార్డుల్లో చూపించి బిల్లులు తీసుకున్నారని గుర్తించింది. అక్కడ తాము పనులు చేస్తే నష్టపోతామని, క్షేత్రస్థాయిలో ఎంత మట్టి పని చేస్తే అంత మొత్తానికి బిల్లులు ఇస్తామంటేనే పనులు చేస్తామని, లేదంటే విస్తరణ పనులు చేయలేమంటూ హెచ్‌ఈఎస్ సంస్థ లేఖ రాయడంతో మట్టిపనుల్లో జరిగిన అక్రమాల భాగోతం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మట్టి పనుల్లో అవినీతి అక్రమాలు నిజమేనని, చేయని పనులకు బిల్లులు డ్రా చేశారని నిగ్గు తేల్చింది. 2012కు ముందు జరిగిన అక్రమాల పాపం విస్తరణకు శాపంగా మారింది.

ఖజానాపై అదనపు భారం?

ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా 2012కు ముందు హంద్రీనీవా కాలువ తవ్వకం పనులు చేసిన ప్యాకేజీ-28, ప్యాకేజీ-28ఏ కాంట్రాక్ట్ సంస్థల నుంచి రూ.6 కోట్లు డిపాజిట్ చేయించారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో వచ్చిన కూటమి ప్రభుత్వం 3,850 క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా హంద్రీనీవా విస్తరణ పనులు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారు. ప్యాకేజీ-2 కింద రూ.430 కోట్లతో చేపట్టిన విస్తరణ పనుల్లో భాగంగా మట్టి పనులు (ఎర్త్‌వర్క్), సీసీ లైనింగ్ పనులు వీపీఆర్-డీఎస్ఆర్ జాయింట్ వెంచర్‌గా చేపట్టాయి. అయితే గతంలో అక్రమాలు జరిగిన 100-105 కిలో మీటర్ల మధ్యలో ఎంత పరిమాణంలో అదనపు మట్టి పనులు చేయాల్సి ఉందో తేల్చాలని ఆ సంస్థ ఇంజనీర్లను కోరింది. ప్రస్తుతం 2021-22 ఎస్ఎస్ఆర్ రేట్ల మేరకు పనులు చేస్తున్నట్లు ఇంజనీర్లు చెబుతున్నారు. చేయని పనులకు బిల్లులు చేసుకున్న పనులకు 2012-13 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం రూ.6 కోట్లు రికవరీ చేయించి డిపాజిట్ చేయించారు. ప్రస్తుతం చేస్తున్న పనులకు 2021-22 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం బిల్లులు చెల్లిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాపై మరో రూ.6 కోట్లు అదనపు భారం తప్పదని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. 13 ఏళ్ల క్రితం కాంట్రాక్ట్ సంస్థ, అప్పటి క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఇంజనీర్లు చేసిన అక్రమాల పాపం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది.



ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తరణ పూర్తి చేస్తాం



హంద్రీనీవా ప్రధాన కాలువ 100-105 కిలోమీటర్ల మధ్యలో కాల్వ తవ్వకం పనులు చేసిన కాంట్రాక్టరు మట్టి పనులు చేయకుండానే చేసినట్లు చూపించి బిల్లులు డ్రా చేశారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా అప్పటి కాంట్రాక్ట్ సంస్థ నుంచి రూ.6కోట్లు డిపాజిట్ చేయించాం. ఆ ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రస్తుత కాంట్రాక్ట్ సంస్థ ద్వారా విస్తరణ పనులకు చేయిస్తున్నాం. అడ్డంకులను అధిగమించి ఈ నెలాఖరులోగా విస్తరణ పనులు పూర్తి చేస్తాం. ఎట్టిపరిస్థితుల్లోనూ 3,850 క్యూసెక్కులు ఎత్తిపోస్తాం.

- పాండురంగయ్య, ఎస్ఈ, హంద్రీనీవా ప్రాజెక్టు, కర్నూలు

బైకు అదుపుతప్పి ఒకరి మృతి

మిడుతూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు గ్రామ సమీపంలో బైకు అదుపుతప్పడంతో ఒకరు మృతి చెందారు. నందికొట్కూరు పట్టణంలోని ఏబీఎం పాలెం చెందిన బంగి నాగరాజు (39) నంద్యాలలోని ఐ అండ్ పీఆర్ డిపార్ట్‌మెంట్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజువారీగా నాగరాజు గురువారం నందికొ ట్కూరు నుంచి విధులు నిర్వహించేందుకు బైకుపై నంద్యాలకు బయలు దేరారు. అయితే రోళ్లపాడు గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికి అక్కడే మృతి చెందారు. ఎస్‌ఐ ఓబులేసు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొ ట్కూరుకు తరలించారు. నాగరాజు భార్య లక్ష్మీదేవి ఫిర్యాది మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

ఆళ్లగడ్డ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన ఆళ్లగడ్డ పట్టణంలోని కోవెలకుంట్ల రోడ్డులో గురువారం చోటుచేసుకున్నది. పట్టణానికి చెందిన షరీఫ్ (50) సంత మార్కెట్లో కాయగూరలు అమ్ముకుని జీవినం సాగించేవాడు. గురువారం కావడంతో ద్విచక్ర వాహనంలో స్నేహితుడు రాధాకృష్ణాతో కలిసి కోవెలకుంట్ల మండలం రేవనూరు గ్రామంలోని దర్గాలో స్వామిని దర్శించుకొని వస్తుండగా చింతకుంట రోడ్డులోని బాలసదనం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నగీనా సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ ఒకరు మృతి

కొలిమిగుండ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సారాకు బానిస అయిన వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన మీర్జాపురం గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మొట్టె రామన్న(34) కొంత కాలంగా సారాకు బానిస అయ్యాడు. దాంతో ఆరోగ్యానికి గురయ్యాడు. లివర్‌తో పాటు అవయావాలు దెబ్బతిన్నట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో గత 15రోజులుగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వాపోయారు. మృతుడికి భార్య కూతురు, కొడుకు ఉన్నట్లు తెలిపారు.

దేవనకొండలో...

దేవనకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. పదిరోజుల క్రితం కరివేముల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డారని, కర్నూలు ఆసుపత్రికి తరలిచంగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల టౌన్, జూన్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలకు చెందిన చల్లా శ్రీనివాసులు (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం తాలుకా పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీనివాసులు ఆరోగ్యం బాగా లేకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీనివాసులు భార్య అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

బాలింత మృతి

డోన్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింత మృతి చెందింది. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామానికి చెందిన మహేశ్వరి కాన్పు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల మహేశ్వరి మృతి చెందింది. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతురాలిని వారి స్వగ్రామానికి తీసుకెళ్లారు.

పొలం వివాదం.. వృద్ధుడిపై దాడి

ఆస్పరి, జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని డొడగొం గ్రామంలో భూ తగాదా విషయంలో కొందరు వృద్ధుడిపై దాడికి పాల్పడ్డారు. గురువారం సీఐ తెలిపిన మేరకు.. డొడగొండ గ్రామానికి చెందిన కుమ్మరి ఈరన్న తన పొలం పక్కనే ఉన్న కొంత ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్నాడు. బుధవారం ఆ భూమిలో ఎక్స్‌వేటర్‌తో పని చేయిస్తుండగా సమీప గ్రామం డి.కోటకొండకు చెందిన దస్తగిరి, ఉసేని బాధితుడిపై దాడిచేసి కాళ్లు, చేతులు విరగొట్టారు. బాధితుడు ఈరన్నను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు ట్రావెల్ బస్సులు ఢీ..

డోన్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరబండ సమీపాన హైదరాబాదు - బెంగుళూరు వైపు వెళ్తున్న రెండు ట్రావెల్ బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురుకి తీవ్రగాయాలు కాగా, హుటాహుటిన వారిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై డోన్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోండి

ఆదోని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పేదరిక నిర్మూలన విభాగంలో పనిచేస్తున్న తమపై సామాజిక మాధ్యమాల్లో ఓ యువకుడు అసభ్యకర పోస్టులు పెడుతున్నారని రిసోర్స్ పర్సన్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఆదోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐ రాజశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ విజయ్ అనే పేరు మీద సామాజిక మాధ్యమాల్లో పోస్టులు ఉన్నట్లు గుర్తించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడినా, సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు పెట్టినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.




సీఐకు ఫిర్యాదు చేస్తున్న రిసోర్స్ పర్సన్లు

పకడ్బందీగా సామాజిక తనిఖీ

- రూ.21.38లక్షలు రికవరీ చేయాలని ఆదేశం

గూడూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం అధికారు లు పకడ్బందీగా చేపట్టారు. బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో పీడీ వెంకట రమణయ్య పాల్గొని గ్రామాల వారిగా ఉపాధి పనుల్లో జరిగిన అంశాలపై సమీక్షించారు. 2024- 2025 సంవత్సరానికి సంబంధించి మండలంలో 610 పనులు చేపట్టారు. కూలీలకు రూ.7.94కోట్లు పని దినాలను కూలీలకు కల్పించినట్లు వివరిం చారు. అలాగే రూ.9.85 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. కొన్ని రోజులు గా గ్రామాల్లో ఉపాధి పనులపై గ్రామ సభలను నిర్వహించి ప్రజలు, కూలీల నుంచి మొత్తం వివరాలను సేకరించారు. రెండు రోజులుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనుల అక్రమాలను వెలికితీశారు. ఇందు కు సంబంధించి రూ.21.38లక్షలు రికవరీ చేయాలని పీడీ వెంకట రమణయ్య ఆదేశించారు. రూ.29వేలు పెనాల్టీ వేసినట్లు వెల్లడించారు. మొత్తం ఈ ప్రక్రియను వీడియో ద్వారా రికార్డు చేసినట్లు వెల్లడించారు. ప్రోగ్రాం మేనేజర్ మేఘనాథ్ సునిల్, ఎస్ఆర్‌పీ వెంకటేష్ నాయక్, డీవీవో లోకేశ్వర్, ఏపీడీ అల్లిపీరా, ఏపీవోలు రామేశ్వరమ్మ, హసీనా, ఈసీ నాయక్, డీఆర్‌పీలు పాల్గొన్నారు.



మాట్లాతున్న పీడీ వెంకట రమణయ్య

తనిఖేల్

- బోర్డులు మార్చి అధికారులతో ఆటలు
- సౌకర్యాలు శూన్యం.. ధరల పట్టికలకే ప్రాధాన్యం
- కాసుల కోసం కక్కుర్తి
- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- ఆదోనిలో నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల తతాంగం



ఆదోనిలోని ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ పారా మెడికల్ కళాశాల

ఆదోని అగ్రికల్చర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అధికారులు తనిఖీలకు వస్తున్నారంటే వారితో ఓ ఆట ఆడుకున్నారు.. బోర్డులు మార్చి బురిడీ కొట్టించారు.. ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లుగా మాయాజాలం ప్రదర్శించారు.. ఎట్టకేలకు వారితో బురిడీల్ కుదుర్చుకొని పని కానించారు. భవిష్యత్తులో అక్కడ చదివిన విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఎక్కడ నుంచి సర్టిఫికెట్లు ఇస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇంత జరుగుతున్న సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు ఈవిషయంపై చర్యలు తీసుకోక పోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల తతాంగంపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

మూడేళ్లుగా...

ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రహదారిలో టీవీఎస్ షోరూం ఎదురుగా ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్, ఆర్ఎస్ పారా మెడికల్ కళాశాల మూడేళ్లుగా ఇంటిని అద్దెకి తీసుకొని నడుపుతున్నారు. జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ మూడేళ్ల కోర్సు (జీఎన్ఎం), డిప్లమా మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ (డీఎంఎల్‌టీ) డిప్లొమా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (డీఎంపీ హెచ్‌ఏ) వీటితోపాటు మరిన్ని కోర్సులు ఏర్పాటు చేశారు. ఈ కళాశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. కళాశాల నుమతుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవడంతో విజయవాడ వైద్య ఆరోగ్య శాఖ డీఎంఈ కార్యాలయం నుంచి తనిఖీల కోసం బుధవారం ఓ బృందం వచ్చింది. తనిఖీల కోసం వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులకే బురిడీ కొట్టించిన విషయం అందరికీ తెలిసిందే. విశ్వ నారాయణ ఒకేషనల్ జూనియర్ కళాశాలను ఇదే ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల అని చూపించే ప్రయత్నించారు. విశ్వ నారాయణ ఒకేషనల్ జూనియర్ కళాశాల పేరు కనిపించకుండా స్టిక్కర్లు అతికించి బోర్డును ఏర్పాటు చేశారు. తనిఖీకొచ్చిన అధికారులు సైతం అలాచూసి ఇదే నా కాలేజ్ అంటూ వెళ్లిపోయినట్లు తెలిసింది.



డీఎంఎల్‌టీ కోర్సు ఫీజు రసీదు

అధికారులు నిఘా ఉంచాలి

ఓ అద్దె ఇంట్లో విద్యార్థులకు ఎలా బోధిస్తారు. తరగతులు ఎలా నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థులను అడ్మిషన్లు చేసుకొని వేలకు వేలు ఫీజులు వసూలు చేసి ప్రయోగాలకు ల్యాబ్, అనుబంధ ఆసుపత్రి లేకుండానే కొనసాగి స్తామన్నారు. ఇలాంటి విద్యాసంస్థలపై అధికారులు నిఘా ఉంచి విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడాలని పలువురు కోరుతున్నారు. ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలకు చెందిన కరస్పాండెంట్‌కు ఈవిషయంపై ఫోన్ చేయగా రెండు రోజులుగా స్పందించడం లేదు

కోర్సును బట్టి రూ.35వేల నుంచి..

ఆర్ఎస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, ఆర్ఎస్ ఆర్ఎస్‌పారా మెడికల్ కళాశాల ఆదోని అని విద్యార్థులను డీఎంఎల్‌టీ, డీఎంహెచ్‌ఏ కోర్సులకు అడ్మిషన్లు చేసు కుంటున్నారు. అసలు ఈ కళాశాలకు కూడా అనుమతులు లేవు. యథేచ్ఛగా వారు ఏర్పాటు చేసుకున్న కార్యాలయంలో కోర్సుకు సంబంధించిన ఫీజులు బోర్డును ఏర్పాటు చేశారు. కోర్సును బట్టి రూ.35వేల నుంచి రూ.50వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్న ట్లు తెలుస్తోంది. లైబ్రరీ ఫీజు రూ.2వేలు, యూనిఫామ్ రూ.4వేలు, లేబరేటరీ రూ.4500, క్లినికల్ ఫీజు రూ.5వేలు. వీటితోపాటు బుక్స్, ట్రాన్స్‌పోర్ట్ కోసం అదనం చెల్లించాలని సూచిస్తున్నారు.

మరో నర్సింగ్ స్కూల్ కూడా..

పట్టణంలోని విక్టోరియా పేటలో నేషనల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఉంది. ఈ నర్సింగ్ విద్యా సంస్థ కూడా ఐదేళ్లుగా ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా జీఎన్ఎమ్ కోర్సులు నిర్వహి స్తున్నారు. ఈ కళాశాల కరస్పాండెంట్ కర్నూలు ఓ ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన తన పలుకుబడితో ఒక్క కళాశాలను అనుమ తులు లేకుండానే కొనసాగిస్తున్నారు. విద్యార్థి సంఘాలు రెండేళ్లుగా పోరాడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు.



వసూలు చేసిన ఫీజు వివరాలు

'యోగాంధ్ర' ఏర్పాట్లలో జిల్లా నాయకులు

- ఒక్కో బృందానికి ఒక మంత్రికి ఇన్‌చార్జి బాధ్యతలు



విశాఖలో యోగాంధ్ర సమావేశానికి హాజరైన జిల్లా నాయకులు

కర్నూలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. యెగాంధ్ర-2025 కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు. గిన్నీస్ బుక్ రికార్డు నమోదుచేసే లక్ష్యంగా ఈయోగా దినోత్సవం నిర్వహిం చనున్నారు. రాష్ట్ర నలమూల నుంచి లక్షలాది మంది యోగా సాధకులు విశాఖ చేరుకో నున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా పలువురు టీడీపీ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో బృందానికి ఒక మంత్రికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. జిల్లాకు చెందిన పరిశ్ర మలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ నాయకత్వంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కేడీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఏపీ కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, ఏపీ శాలివాహన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర యోగాంధ్ర ఏర్పాట్లు కోసం విశాఖ చేరుకున్నారు. వారికి రాష్ట్ర నలుమూల నుంచి వచ్చే యోగా సాధకులను క్రమపద్ధతిలో యోగా ప్రాంగణం లోకి పంపించే బాధ్యతలు అప్పగించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా డే నిర్వ హిస్తున్న సందర్భంగా గురువారం విశాఖలో ఏయూ కన్వెన్షన్ సెంటర్ నుంచి విశ్వప్రి య ఫంక్షన్‌హాల్ వరకు యోగాంధ్ర వాక్‌థన్ కార్యక్రమం నిర్వహించారు. సహచర మంత్రులతో కలసి మంత్రి బీసీ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆర్‌కె బీచ్ కేంద్రంగా యోగాసనాలు వేశారు.



యోగాసనాలు చేస్తున్న మంత్రి బీసీ

ఎమ్మెల్యే, క్రిష్ణమ్మపై కేసు నమోదు చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు

కర్నూలు అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదోని మండలం ఢణాపురంలో జరిగిన కూటమి ప్రభుత్వ సంవత్సర పాలన సంబరాలు జరుపుకుంటూ గుడి దగ్గర జరిగిన సభలో దళితుడైన సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమా నించడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రాజ్యాంగ హక్కులను గౌరవించి సాటి మనిషిని మనిషిగా చూడటం నేర్చుకోవా లని కోరారు. ఎమ్మెల్యే, గుడిసె క్రిష్ణమ్మపై సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బాబురావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, లాజరస్ పాల్గొన్నారు.

క్షమాపణలు చెప్పాలి : కేవీపీఎస్

కర్నూలు న్యూసిటీ: దళిత సర్పంచ్‌ని అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ క్షమాపణలు చెప్పాలని కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఆర్.రమణ డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ పాతనగరం కమిటీ అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సభా వేదికపైకి గ్రామప్రథమ పౌరుడైన దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను పిలవకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడటము దారుణమన్నారు. దుర్మార్గమైన హేయమైన ఘటనకు కారణమైన కూటమి టీడీపీ ఇంచార్జి గుడిసె కృష్ణమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిపై ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలాని డిమాండ్ చేశారు. నాయకులు గురుస్వామి, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్.జి.కృష్ణ పాల్గొన్నారు.

- బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకులు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.
- దళిత సర్పంచును కులం పేరుతో అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్, జిల్ల ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ.సుభాన్ డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

వ్యక్తిపై దాడి

కర్నూలు క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీవ్ గృహకల్పలో షేక్ హుశేన్ అనే వ్యక్తిపై సుభా న్, లడ్డూ, శ్రావణ్, చాంద్‌బాషా, పెయింటింగ్ చాంద్‌లు దాడి చేసి గాయపరిచారు. నిందితులకు షేక్‌గౌస్ అనే వ్యక్తితో మనస్పర్థలు ఉ న్నాయి. ఈక్రమంలో షేక్ గౌస్, బాధితుడు హుశేన్‌లు రాజీవ్ గృహ కల్పలో 15వ తేదీ రాత్రి ఇంటి వద్ద కూర్చుని ఉండగా.. నింది తులు షేక్ గౌస్‌తో గొడవపడ్డారు. ఈ గొడవను ఆపేందుకు షేక్ హుశేన్ ప్ర యత్నించగా.. ఐదుగురు నిందితులు షేక్ హుశేన్‌పై దాడిచేసి గాయపరిచారు. ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హృదయ విదారకం

- విద్యుత్ పనులు చేస్తూ వ్యక్తి దుర్మరణం
- ఒకే హాస్పిటల్‌లో భర్తకు శవ పరీక్ష.. భార్యకు పురిటినొప్పులు
- మిన్నంటిన బంధువుల రోదనలు
- ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో ఘటన

గోనెగండ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఓ హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కాగా మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అదే సమయంలో మృతుడి భార్యకు పురిటినొప్పులు రావడంతో అదే ఆస్పత్రిలో కాన్పుల వార్డుకు తీసుకొచ్చారు. ఓ వైపు భర్తకు శవ పరీక్షలు జరుగుతుండగా మరో వైపు భార్య పురిటినొప్పులతో పడుతున్న వేదనను పలువురి కంట తడిపెట్టించింది. స్థానికులు తెలిపిన వివరాలు..గోనెగండ్లకు చెందిన బోయ కడపల వెంకటేశ్ కుమారుడు బోయ కడపల చంద్రశేఖర్(30) కూలీ పనులు చేస్తు జీవనం సాగించేవాడు. చంద్రశేఖర్‌కు భార్య భారతి, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భారతి గర్భవతి. చంద్రశేఖర్ కొన్నేళ్లుగా విద్యుత్ పనుల నిమిత్తం ప్రతి రోజు స్తంభాలు ఎత్తడం విద్యుత్ వైర్లు లాగడం వంటి పనులకు వెళ్లేవాడు. ప్రతి రోజు మాదిరే గురువారం కూడా మండలంలోని కులుమాల గ్రామ శివార్లలో రైతు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే పనుల నిమిత్తం విద్యుత్ స్తంభం ఎక్కాడు. అదేప్రాంతంలో 11కేవీ వైర్ ఆ ప్రాం తంలో ఉంది. ఆ ప్రాంతంలో చంద్రశేఖర్ విద్యుత్ స్తంభం ఎక్కాడు. స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు జారి కింద ఉన్న ట్రాక్టర్ ట్రాలీ పై పడ్డాడు. దీంతో చంద్రశేఖర్ తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య భారతికి పురిటినొప్పులు రావడంతో అదే ఆసుపత్రికి బంధువులు తీసుకొచ్చారు. ఓ వైపు భర్తకు శవపరీక్ష జరుగుతుండగా .. మరోవైపు భార్య పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరింది. ఈ విషయం తెలుసుకున్న బంధువుల రోదనలు మిన్నంటాయి. 11 కేవీ విద్యుత్ తీవ్రత కారణంగా కింద పడ్డాడా లేక ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడా అన్నది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ విజయభాస్కర్ తెలిపారు.



బోయ చంద్రశేఖర్(ఫైల్)

కౌన్సిల్ మీట్ రసాభాస

● గత నెల సమావేశం ఎందుకు సమావేశం నిర్వహించలేదు? ● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆగ్రహం

● సమస్యలు పరిష్కరించడం లేదని ఓ వర్గం కౌన్సిలర్ల అసంతృప్తి ● టేబుళ్లు వేయలేదని నేలపై బైఠాయించిన ఓ కౌన్సిలర్



మున్సిపల్ కమిషనర్‌ను నిలదీస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనుల కోసం రూ.3కోట్లు మంజూరుపై సమావేశం నిర్వహించాలని, గత నెలలో తాను చెబితే కూడా ఎందుకు సమావేశం నిర్వహించలేదని, ప్రజా సమస్యలు పట్టవా? అని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కమిషనర్ బేబిని ప్రశ్నించారు. ప్రస్తుతం కూడా మెజార్టీ కౌన్సిలర్లు ప్రతిపాదించిన తీర్మానాలను మాత్రమే ఆమోదించండి.. మిగిలిన వాటిని మీరు, మీ చైర్మన్ కలిసి ఆమోదించుకోండి ఆగ్రహం వ్యక్తంచేశారు. సభకు హాజరైన తమ వర్గం కౌన్సిలర్లు ఆమోదించిన 26 అంశాలతో పాటు టేబుల్ అజెండాలోని మరో 11 అంశాలను ఆమోదిస్తున్నట్లు సంతకాలు చేసి కమిషనర్ బేబికి అప్పగించారు. తీర్మానాలను ఆమోదించే సమయంలో సభలో ఎంత మంది ఉంటే వారిలో 3వ వంతు సభ్యులు ఉంటేనే తీర్మానాలను ఆమోదించాలని చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కమిషనర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సభకు మొత్తం కౌన్సిలర్లు హాజరయ్యారని, అందులో అందరూ సంతకాలు చేశారని, వారిలో తమ వర్గం కౌన్సిలర్లు 3వ వంతు మెజార్టీ ఉన్నారంటూ సంతకాలు చేయించిన తీర్మానాల లేఖను కమిషనర్‌కు అందజేసి సభ నుంచి వెళ్లి పోయారు.

'మెజార్టీ కౌన్సిలర్ల సమస్యలను మాత్రమే తీర్మానిస్తామంటే ఎలా?'

మెజార్టీ కౌన్సిలర్ల సమస్యలను మాత్రమే తీర్మానిస్తామంటే ఎలా? అని, తాము సమావేశానికి వచ్చి లాభమేమిటని 28వ వార్డు కౌన్సిలర్ రాధిక ప్రశ్నించారు. ఇలాగైతే తాము సభకు రాకుండా ప్రజల్లోకి వెళ్తామని అన్నారు.



టేబుళ్లు వేయలేదని నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

'మా వార్డు ప్రజలను పన్నులు అడగవద్దు'

తమ వార్డులోని సమస్యలను పరిష్కరించనప్పుడు తమ వార్డులోని ప్రజలను పన్నులు అడగవద్దని 7వ వార్డు కౌన్సిలర్ లాలుప్రసాద్ కమిషనర్‌ను హెచ్చరించారు. కమిషనర్ స్పందిస్తూ.. ప్రతి వార్డులో పన్నులు వసూళ్లు చేయడం తమ బాధ్యత అని, మీరు ఏమి చేయాలనుకున్నా రాతపూర్వకంగా ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నేలపై బైఠాయింపు

సమావేశంలో టేబుళ్లు ఎందుకు వేయలేదంటూ ఎంపీ బైరెడ్డి శబరి వర్గానికి చెందిన కౌన్సిలర్ చాంద్‌బాషా ప్రశ్నిస్తూ... నేలపై బైఠాయించారు. వైసీపీ కౌన్సిలర్ అల్లూరి కృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు చికెన్ గఫార్ మద్దతుగా నిలిచారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం జోక్యం చేసుకొని వారికి సర్దిచెప్పారు. ఎందుకు టేబుళ్లు వేయలేదని కమిషనర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే టేబుళ్లు వేయించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

ఒక్కొక్కరుగా సభ నుంచి జారుకున్న కౌన్సిలర్లు

సమావేశం ప్రారంభం కాగానే లాక్‌బుక్‌లో సంతకాలు చేసి ఒక్కొక్క కౌన్సిలర్ సభ నుంచి వెళ్లి పోయారు. వైస్ చైర్మన్ ప్రశాంతి సంతకం చేసి ముందుగా వెళ్లి పోయారు. ఆ తర్వాత వైసీపీ కౌన్సిలర్ అల్లూరి కృష్ణ, ఆ తర్వాత ఎమ్మెల్యే వర్గానికి చెందిన నలుగురు మహిళా కౌన్సిలర్లు ఒకరి తర్వాత మరొకరు సభ నుంచి వెళ్లిపోయారు. అజెండా అంశాలను చదివే లోపే ఆరుగురు కౌన్సిలర్లు సమావేశం నుంచి వెళ్లి పోయారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపాడు గ్రామానికి చెందిన దూదెకుల పెద్ద రోషన్నకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గురువారం ఎమ్మెల్యే గౌరుచరిత పంపిణీ చేశారు. పెద్దరోషన్న కంటి సమస్యతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.36 వేలు మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బీవీఎన్ రాజు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగా చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. యోగాంధ్రప్రదేశ్‌లో భాగంగా గురువారం అల్లూరు గ్రామంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య యోగా ఆసనాలు వేశారు. యోగా విశిష్టతను వివరిస్తూ ప్రతి మనిషి ఆరోగ్య చైతన్యానికి యోగ నాంది అని ఆయన అన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

నందికొట్కూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతకు ధ్యానం మూలమని శ్రీ రామచంద్ర మిషన్ జిల్లా కోఆర్డినేటర్ సుజల అన్నారు. పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. సుజల మాట్లాడుతూ ధ్యానం వల్ల మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం కూడా కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు రోజూ ధ్యానం చేయడం వల్ల వారికి ఎన్నో విధాల మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీ రామచంద్రమిషన్ నందికొట్కూరు సెంటర్ కో ఆర్డినేటర్ సుధాకరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు వేణుగోపాల్, నందికొట్కూరు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్న ప్రభుత్వం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

గోస్పాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం అని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలో 'తల్లికి వందనం' లబ్ధి పొందిన సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, నాయకులతో కలిసి గురువారం సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక విద్యార్థికి డబ్బులిచ్చి గొప్పలు చెప్పుకున్నారని, కూటమి ప్రభుత్వం కుటుంబంలో ఎంతమంది విద్యార్థు లుంటే అంతమందికి రూ.13వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేసిందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి కార్యక్రమాలు జరగడం లేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అన్ని కూడా అమలవు తాయని అన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న వైసీపీ నాయకుల మాటలు నమ్మవద్దని ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వంవైపు ప్రజలు నిలబడాలని అన్నారు. విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తులసీశ్వరరెడ్డి, గ్రామ నాయకులు ఓబుళరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అభిరుచి మధు

నంద్యాల కల్చరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సూచించారు. నంద్యాల మండలంలోని పాండు రంగాపురం గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో భారత్ సంకల్ప యాత్రను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా విజయవాడ ఇన్‌చార్జి, వికసిత్ భారత్ కన్వీనర్ కాదర్‌బాద్ నరసింగరావు హాజరయ్యారు. గ్రామ ప్రజలు బీజేపీ నాయకులకు అపూర్వ స్వాగతం పలికారు. మధు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన గరీబ్ కళ్యాణ్ యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం సోలార్ ఘర్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి, ప్రధానమంత్రి మోదీ తన 11 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలముని, మండల అధ్యక్షుడు గురుబ్రహ్మం, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడాలి

ఆత్మకూరురూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా నాయకులు రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్నలు పిలుపు నిచ్చారు. మండలంలోని శ్రీపతిరావు పేట గ్రామంలో గురువారం పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా పోరాటాల వేదికకు ప్రజలు మద్దతు పలకాలని కోరారు. నాయకులు శివనారాయణ, ముర్తుజాబీ, వెంకటశివుడు, దాసు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

బండిఆత్మకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం జిల్లా ఉపాధ్యక్షుడు పబ్బతి అబ్రహాం, మండల ఇన్‌చార్జి జావిద్ బండిఆత్మకూరు బస్టాండ్‌లో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఖుద్దూస్ ఖాన్, పాల మాబు, వెంకటన్న పాల్గొన్నారు.

పాములపాడు: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాములపాడులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ షేక్షావలి ఆధ్వర్యంలో, నందికొట్కూర్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షాజహాన్‌బేగం, జూపాడుబంగ్లా మండలం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుబ్బమ్మ, మండల కాంగ్రెస్ నూతన ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్‌రఫీతో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు షైమాకర్, అష్రఫ్‌వలీ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

పాములపాడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పాములపాడులోని మోడల్ స్కూల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో చంద్రశేఖర్ పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులకు సన్నబియ్యం తో అన్నం, ప్రత్యేకంగా మెనూ ఏర్పాటు చేసి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రిన్సిపాల్ నాగరవీంద్ర, పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అనీమియా నివారణపై అవగాహన

ఆత్మకూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలా పురం గ్రామంలో వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా వ్యాధి నివారణపై గురువారం అమలాపురం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ సాధారణంగా మానవ శరీరంలో ఉన్న ఎర్రరక్త కణాలు వివిధ అవయవాలకు ప్రాణ వాయువును సరఫరా చేస్తాయని, అయితే కొంత మందిలో జన్యు సంబంధమైన మార్పుల వల్ల ఎర్రరక్త కణాలు సికిల్ ఆకారంలోకి మారతాయని అన్నారు. ఇటువంటి లక్షణాలు కలిగిన ఇరువురు వివాహం చేసుకోవడం ద్వారా పుట్టే పిల్లలకు రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. సికిల్ సెల్‌తో రక్తనాళాల్లో కొత్త ఎర్రరక్త కణాలు ఉత్పత్తి కాక పోవడంతో శరీరానికి ఆక్సిజన్ అందటం తగ్గిపోతుందని తెలిపారు. సూపర్ వైజర్ రమణమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆదోని ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి'

నంద్యాలరూరల్, జూన్ 19('ఆంధ్రజ్యోతి): ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న ఆదోనిలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ సర్పంచ్ చంద్రశేఖర్‌ను వేదికపైకి పిలువకుండా అవమానించడం అనారికమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆత్మకూరు: దళితులను అవమానపర్చిన ఆదోని ఎమ్మెల్యే పార్థ సారథిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర, వీరన్న, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదిన ఆదోని నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎస్సీ సర్పంచ్‌ను వేదికపైకి పిలువకుండా అవమానపర్చడం సరికాదని అన్నారు. ఒక ప్రతినిధిగా వ్యవహరిస్తూ బహిరంగంగానే దళితులపై కులవివక్ష చూపేలా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు.

కొత్తపల్లి: ఆదోని మండలం దానాపురం గ్రామంలో ఈ నెల 16న సభావేదిక వద్ద దళిత గ్రామ సర్పంచ్‌ను అవమానపరిచిన స్థానిక ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్.స్వాములు, నాయకులు ఎస్.సంజీవరాయుడు డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సీఎం సమావేశంలో మాట్లాడుతూ దళితుల పట్ల వివక్ష ప్రదర్శించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.ఏసన్న, జి.దాసు, ఎన్.దాసు పాల్గొన్నారు.

'మాన్యం అన్యాక్రాంతమైతే ఊరుకోం'



కొణిదేలలో నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల నాయకులు, గ్రామస్థులు

నందికొట్కూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మాన్యం అన్యాక్రాంతమైతే చూస్తూ ఊరుకునేది లేదని విశ్వహిందూ పరిషత్, బజరంగదల్ జిల్లా నాయకులు వైపీ రామయ్య, భాగిరెడ్డి నాగిరెడ్డి అన్నారు. మండలంలోని కొణిదేల గ్రామంలో వెలసిన వినాయక స్వామి ఆలయా నికి 1976లో గుంతా వెంగయ్య అనే దాత 6.18 ఎకరాల భూమిని ఇచ్చారని గ్రామస్థులు తెలిపారు. ఆ భూమిని దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు వేలం పాట నిర్వహించడానికి మూడు సార్లు గ్రా మంలో దండోరా వేయించి వెంటనే మరలా ఏ కారణాలు చెప్పకుండానే అర్ధాంతరంగా వాయిదా వేసి వెళ్లిపోతున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకుల దృష్టికి తీసుకుని వెళ్లారని నాయకులు తెలిపారు. దీనితో గురువారం నంద్యాల, కర్నూలు జిల్లా వీహెచ్‌పీ, బజరంగదల్ నాయకులు గ్రామంలో వినాయక స్వామి దేవాలయం వద్ద పెద్ద ఎత్తున గ్రామస్థులతో కలిసి నిరసన తెలిపారు. దేవాలయ భూమిని గ్రామంలో కొంత మంది కాజేయాలని చూస్తున్నారని వారు ఆరోపించారు. వీహెచ్‌పీ జిల్లా నాయకుల కిషోర్‌కుమార్, నాగరాజు, వెంకటేష్, ఆవుల రెడ్డి, గ్రామ నాయకులు చల్లా వెంకటరెడ్డి, చెల్లా లక్ష్మిరెడ్డి, సత్యంరెడ్డి, దాసరి నాగరాజు, గుట్టపాటి ఆంజనేయులు, సంజీవరెడ్డి, టీడీపీ నాయకులు కుర్వ చిన్న శివన్న, వంగాల ప్రదీప్‌రెడ్డి, వంగాల సతీష్‌రెడ్డి చల్లా రాజశేఖరెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బండిఆత్మకూరు సచివాలయంలో చర్చిస్తున్న కృష్ణారెడ్డి

బండిఆత్మకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. బండిఆత్మకూరులోని సచివాలయం 1, 2లలో గురువారం 'తల్లికి వందనం' లబ్ధిదారుల జాబితాను పరిశీలించారు. అందులో డబ్బు జమ కాని వారి వివరాలు, కారణాలు అడిగి తెలుసు కున్నారు. అర్జీలు ప్రజల నుంచి తీసుకుని సచివాలయ అధికారులకు అందజేశారు. టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, జాకీర్, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యా: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సమాచార, పౌర సంబందాల శాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం తెల్లవారుజామున మిడుతూరు మండలం రోళ్లపాడు మలుపువద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజు మృతిచెందారని సమాచారం తెలిసిందని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం కలెక్టర్ తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందించాలని డీపీఆర్వో మల్లికార్జున, నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులును కలెక్టర్ ఆదేశించారు. నాగరాజు మృతిపట్ల డీఐపీఆర్వో కార్యాలయ సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ తమ సంతాపం తెలిపారు.

తొమ్మిది రకాల సరుకులు ఇవ్వాలి

పాములపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌక దుకాణాల ద్వార ప్రజలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి సామన్న, మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, రాజు తహసీల్దార్ సుభద్రమ్మకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెరుగైన సేవలు అందిస్తామని హామీలు ఇచ్చారన్నారు. అయితే రేషన్ షాపులలో కేవలం బియ్యం, చక్కెర రెండు వస్తువులు మాత్రమే ఇస్తున్నారని, మిగతా కందిబేడలు, బెల్లం తదితర మొత్తం తొమ్మిది రకాలు నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు.

పోలీసుల కార్డన్ సెర్చ్



తనిఖీ చేస్తున్న ఆత్మకూరు పోలీసులు

ఆత్మకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంతో పాటు చుట్టు పక్కల గల పలు గ్రామాల్లో గురువారం పోలీసులు కార్డన్ సెర్చ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్మకూరు అర్బన్ సీఐ రాము మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌తో పాటు కరివేన గ్రామంలో తెల్లవారు జాము నుంచే బృందాలు ఏర్పడి కార్డెన్ సెర్చ్ చేపట్టామని అన్నారు. ఇందులో భాగంగా పలువురు అనుమానితులు, నేరచరిత్ర కలిగిన వారి నివాసాల్లో తనిఖీ చేయగా 15 మద్యం సీసాలతో పాటు సరైన ధృవీకరణ పత్రాలు లేని 30 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూన్ 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో త్రిఫలవృక్షం కింద వెలిసిన దత్తాత్రేయస్వామి గురువారం విశేషపూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం ముందుగా గణపతి పూజ నిర్వహించి దత్తాత్రేయ స్వామి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

● శ్రీశైల క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్ రాగరమ్య కల్చరల్ ఆర్గనైజేషన్ వారితో సంప్రదాయ నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహాగణపతిం, మూషికవాహన, శివతాండవం, శివస్తుతి, భో...శంభో, శంభోశంకర, గంగాధర శంకరా తదితర గీతాలకు మంజుల, శివాని, ఇందుశ్రీ, సహస్ర, వేదాంశి, సంజన తదితరులు నృత్యప్రదర్శన చేశారు. ఈ నిత్యకళారాధనలో భాగంగా హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కౌలు రైతులు కార్డులు పొందాలి

బండిఆత్మకూరు జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లబ్ధి పొందాలంటే కచ్చితంగా కౌలు రైతులు కార్డులు పొందాలని ఏవో పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని సంతజూటూరు, పెద్ద దేవళాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను గురువారం ఏవో తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రైతుల వద్ద నుంచి భూమి కౌలుకు తీసుకున్న రౌతు రెవెన్యూ అధికారుల నుంచి కౌలు కార్డు పొంది ఉంటేనే అన్నిరకాల లబ్ధి చేకూరుతుందన్నారు. వీఏఏ సుహాసిని పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జూపాడుబంగ్లా, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లాలోని వ్యవసాయ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య హాజరు అవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో ఇస్తే అధికారులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ

పాములపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు యాభైశాతం రాయితీతో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి మహేశ్వర రెడ్డి తెలిపారు. మండలంలోని జూటూరు, తుమ్మలూరు గ్రామాలలోని రైతుసేవా కేంద్రాల వద్ద గురువారం ఆయ గ్రామాల రైతులతో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులు వాడకం, అన్నదాత సుఖీభవ, ఈకేవైసీ, కౌలురైతు గుర్తింపుకార్డులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది రామాంజనేయులు, స్వాతి, చాంద్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

ఆత్మకూరురూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు ఆశిస్తున్న కత్తెర పురుగును నివారించేందుకు రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి హేమలత రైతులకు సూచించారు. మండలంలోని కరివేన, నల్లకాలువ గ్రామాల్లో గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారి కలాం, ఎంపీఈవో రాజశేఖర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం పోరాటం

నంద్యాలరూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటం ఆపే ప్రసక్తే లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. గురువారం ఆపార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నంద్యాల పట్టణంలోని అనేక సమస్యలపై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, సోమన్న, శ్రీనివాసులు, సుశీలమ్మ తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి: ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వకపోతే ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతి పేదలకు పంపిణీ చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పాలక ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం కొత్తపల్లి ఆ పార్టీ మండల కార్యదర్శి వెంకటశివుడు అధ్యక్షతన గ్రామ సమావేశం జరిగింది. రంగనాయుడు మాట్లాడుతూ పేద ప్రజల కోసం రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 10న కొత్తపల్లి మండలంలో మహాసభ జరుగుతుందని ఈ సభలో వందలాది మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్‌బాబు, నాయకులు సంజీవులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, కార్యదర్శి ప్రతాప్, ముర్తుజాబీ పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు రైతులందరికీ అందేందుకు ఉమ్మడి రైతు కుటుంబాలు తమ భూములకు రీ సర్వే ద్వారా వేరు పరిచి ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, రైతులు సద్వినియోగం చేసుకుని తమ పొలాలను రీ సర్వే ద్వారా సబ్ డివిజన్ చేసుకోవాలని ఆర్డీవో నాగజ్యోతి సూచించారు. గురువారం పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి కుటుంబాలు కలిగి తమ భూములను సబ్‌డివిజన్ చేసుకోని కారణంగా ఆయా రైతులకు పలు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. అలాంటి సమస్యలు కలిగిన రైతుల రెవెన్యూ అధికారులకు అర్జీలు సమర్పించి వారి పొలాలను సబ్ డివిజన్ చేసుకుని ప్రభుత్వ పథకాలు పొందాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని సుమోటోగా ఆత్మకూరు డివిజన్ పరిధిలో రైతుల నుండి అర్జీలు స్వీకరించి వారి భూములకు సబ్‌డివిజన్ నిర్వహించి ఆన్‌లైన్‌లో వారి పేర్లను నమోదు చేస్తామని తెలిపారు. ఇందుకు రైతులు వారి సమస్యలతో కూడిన అర్జిలను స్థానిక రెవెన్యూ అధికారులకుగాని, తహసీల్దార్‌కు గాని సమర్పించి రీ సర్వే ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తద్వారా పభుత్వ పథకాలు అందరికి అందేలా వీలుంటుందని తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తా



బీసీ రాజారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంగళ వారంపేటలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల (బాలుర) అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. పాఠశాల హెచ్ఎం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు బీసీ రాజారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని కోరారు. పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయ బృందం కృషి చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానకిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, మురళి, జరీనాబేగం, పూలకలాం పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) జి.తిమ్మరుసునాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ గీతా ఆధ్వర్యంలో రోడ్డుభద్రతా వారోత్సవాలపై విద్యార్థులకు, బస్సుల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కూడా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో ఏఎంవీఐ ప్రదీప్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సెయింట్ జోసెఫ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

ఆళ్లగడ్డ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో టీడీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని నియోజకవర్గ పరిశీలకుడు బేస్త మల్లికార్జున అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గం సంస్థాగత ఎన్నికలకు పార్టీ పరిశీలకులను నియమించిందన్నారు. గ్రామ, మండల, పట్టణ కమిటీలు కష్టపడి పని చేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో బోయ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కప్పట్రాల బొజ్జమ్మ, ఆళ్లగడ్డ పరిశీలకుడు లాయర్ శ్రీనివాస్, రుద్రవరం మండల పరిశీలకుడు షేక్షావలి, రాంభూపాల్‌రెడ్డి, నూర్‌బాష, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ పాలన భేష్

- బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి

కోవెలకుంట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ప్రధాని మోదీ పాలన భేష్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డాక్టర్ బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ముదివేడు సర్కిల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు లోకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ 11 సంవత్సరాల పరిపాలన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీతారామయ్య, బనగానపల్లె నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనరు సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జగాల్ల లింగన్న, నాయకులు వెంకటసుబ్బయ్య, అప్పపోగుల వెంకటసుబ్బయ్య, ఎంతవోలు రాజయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్ఐ నిధులను రెన్యువల్ చేయాలి

ప్యాపిలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థకు చెందిన ఎఫ్‌సీఆర్ఐ నిధులను రెన్యువల్ చేయాలని దళిత సంఘం నాయకులు కోరారు. గురువారం ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దారు భారతిలకు వినతి పత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు భాస్కర్, ఓబులేసు, పలువురు పాల్గొన్నారు.

చిన్నయ్యస్వామి చెంచుగూడెంకు రూ.39లక్షలు మంజూరు

రుద్రవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెంకు రూ.39లక్షలు నిధులు మంజూరు అయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. ఈ నిధులతో చెంచుగూడెంలో 40వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే జడ్పీ నిధులు రూ.2.50 లక్షలు శ్రీరంగాపురానికి మంజూరయినట్లు తెలిపారు.

నేడు రెవెన్యూ డే

కోవెలకుంట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల మేరకు రెవెన్యూ డే నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సిబ్బంది ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

పశువులకు గొంతువాపు వ్యాధి టీకాలు

రుద్రవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు పశువైద్యశాల పరిధిలో పశువులకు గొంతువాపు వ్యాధి సోకకుండా ముందస్తు టీకాలు వేసినట్లు వైద్యాధికారి నాగప్రసన్న గురువారం తెలిపారు. ఆలమూరు, చిత్తరేణిపల్లె, ముకుందాపురం, హరినగరం, పలు గ్రామాల పరిధిలో పశువులకు టీకాలు వేశామన్నారు. వర్షాలు కురిస్తే ములకగడ్డి తినడంతో గొంతు వాపు వ్యాధి వస్తుందన్నారు. ఆ వ్యాధి రాకుండా ముందస్తు టీకాలు వేశామన్నారు.

నేడు ఆలయ భూములు వేలం

కొలిమిగుండ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములకు శుక్రవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 31.1ఎకరాలకు సంబంధించి ఏడాదికి మాత్రమే కౌలుకు వేలం వేయనున్నారు. ఆసక్తి కలిగిన రైతులు పేర్లు నమోదు చేసుకొని వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

రేషన్ దుకాణాల కాటాల తనిఖీ

ఆళ్లగడ్డ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లకు చెందిన ఈ పాస్ కాటాలను టెక్నికల్ అధికారులు తనిఖీ చేశారు. పట్టణంలోని పలు రేషన్ దుకాణాల కాటాలను కర్నూలు నుంచి వచ్చిన టెక్నికల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి మాట్లాడుతూ మండలంలోని రేషన్ దుకాణాల డీలర్ల కాటాలు, ఈ పాస్ మిషన్లలో ఏవైనా లోపాలు ఉంటే సరి చేస్తున్నట్లు చెప్పారు.

జాయింట్ ఎల్‌పీలను వేరు చేయండి

దొర్నిపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే అయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీ నంబర్‌లను వెంటనే వేరు చేయాలని తహసీల్దార్ సుభద్ర సర్వేయర్లకు సూచించారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జాయింట్ ఎల్‌పీ ఎంలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. దీంతో వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, మండల సర్వేయర్ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుచికర భోజనం

- విద్యార్థులకు పోషకాహారం
- సమూల మార్పుకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

చాగలమర్రి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించి మెనూలో మార్పులు తెచ్చారు. ప్రస్తుతం ఈ ఏడాది ప్రారంభం నుంచే విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించి పాఠశాలలకు సరఫరా చేసింది. మండలంలోని 38 ప్రాథమిక పాఠశాలలు, 9 ఉన్నత పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో 4,950 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వంట ఏజెన్సీ మహిళల ద్వారా మెనూ ప్రకారం సన్నబియ్యంతో తయారు చేయించి విద్యార్థులకు అందిస్తున్నారు. 80శాతం మందికి పైగా విద్యార్థులు ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తింటున్నారని అధికారులు పేర్కొన్నారు. పోర్టిఫైడ్ బియ్యం కలిపి అందిస్తుండటం వల్ల ఏబీడీఈ విటమిన్‌లతో పాటు జింక్, ఐరన్ అయోడిన్ వంటి ఖనిజాల పోషక విలువలు లభిస్తాయని అంటున్నారు. సన్నబియ్యంతో వంట తయారు చేసి విద్యార్థులకు అందిస్తుండటంతో విద్యార్థులు కూడా రుచికరంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చాగలమర్రి పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థినులు

రోజూ పాఠశాల వద్దే..



రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం అందజేసి ఎంతో మేలు చేసింది. సన్న బియ్యంతో తయారు చేసిన భోజనం ఎంతో రుచికరంగా ఉంది. రోజు పాఠశాల వద్దే మధ్యాహ్న భోజనం తినేందుకు అవకాశం కలిగింది.

-స్నేహలత, పదో తరగతి విద్యార్థిని

ఎక్కువ మంది తింటున్నారు



ప్రభుత్వం వచ్చాక పాఠశాలలో మధ్యాహ్న భోజనం సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నారు. ఈ భోజనం వల్ల హాజరుశాతం కూడా పెరిగింది. ఎక్కువ మంది పిల్లలు తింటున్నారు.

- ఈశ్వరి, పదో తరగతి విద్యార్థిని

ప్రారంభం రోజు నుంచే..



బడి ప్రారంభం రోజునే మధ్యాహ్న భోజనంలో మార్పు తెచ్చారు. సన్న బియ్యంలో విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. ఇది వరకు అందిస్తున్న బియ్యం లావు ముద్దగా ఉండటంతో తినేవారు కాదు. సన్న బియ్యం భోజనం రుచికరంగా ఉంది.

- మనిషా, తొమ్మిదో తరగతి

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
- పాతబస్టాండులో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు రాస్తారోకో

బేతంచెర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని పునరుద్ధరించి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల నిరాహారదీక్ష 18వ రోజుకు చేరాయి. యాజమాన్యం స్పందించకపోవడంతో గ్రామ పరిధిలో కాకుండా మండల పరిధిలో కార్యక్రమం చేయాలని సిమెంటు ఫ్యాక్టరీ నుంచి బేతంచెర్లకు 200 మంది కార్మికులు వారి కుటుంబాలతో కొత్తబస్టాండు నుంచి ర్యాలీగా పాతబస్టాండు వరకు చేరుకుని మానవహారం నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. వీరికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సంఘీభావం తెలిపారు. అలాగే సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, ట్రేడ్ యూనియన్ ప్రజా సంఘాలు, కుల సంఘాలు అన్ని రకాల రాజకీయ పార్టీల నాయకులు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేరేవరకు, యాజమాన్యం దిగొచ్చేవరకు అండగా ఉంటామని సంఘాలు భరోసా ఇచ్చాయి. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఫ్యాక్టరీ విషయాన్ని, కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, టీడీపీ మైనార్టీ నాయకులు జాకీరుల్లాబేగ్, భీమేశ్వర్‌రెడ్డి, నాయకులు బుగ్గన బ్రహ్మానందరెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఖాద్రి బాషా, సీపీఐ భార్గవ్, సుంకన్న, కాంగ్రెస్ ఇన్‌చార్జి గార్లపాటి మద్దిలేటి, డోన్, ప్యాపిలి, బేతంచర్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సీపీఎం నాయకులు బాస్కర్‌రెడ్డి, వర్దన్ రెడ్డి, ఎరుకుల చెరువు శివ, కౌన్సిలర్లు బుక్కాపురం సర్పంచ్, నాయకులు, రాముడు,సురేష్, సుభాన్, వాసు, కార్మికులు పాల్గొన్నారు.



రాస్తారోకోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

ప్రజా సంక్షేమం అభివృద్ధే లక్ష్యం

డోన్ నియోజకవర్గ ప్రజా సంక్షేమం అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌ను నిర్వహించి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, నాయకులు మధుశేఖర్ కోరారు. కార్యక్రమంలో టింగు, యువరాజు, వెంకటరమణ, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణా తరగతులు

బనగానపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న యోగాంధ్ర శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఆయుష్ సీనియర్ మెడికల్ అధికారి లైకూర్ రహిమాన్ ఆధ్వర్యంలో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, డాక్టర్లు, వైద్య సిబ్బంది యోగా శిక్షణా శిబిరాల్లో పాల్గొన్నారు. యోగా వల్ల కలిగే లాభాలను లైకూర్ రహిమాన్ వివరించారు. యోగాంధ్ర షార్ట్ ఫిలిం చేసినట్లు తెలిపారు. ఈషార్టు ఫిలిం రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం లభించినట్లు తెలిపారు. అలాగే స్కిట్‌లో మూడవస్థానం పొందామన్నారు.



యోగా శిక్షణలో పాల్గొన్న వైద్యసిబ్బంది

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

చాగలమర్రి: మండలంలో యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. గురువారం ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌తో కలిసి తహసీల్దార్ మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలని అన్నారు. మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వేను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : ఈ నెల 21న మండలంలో కూడా అన్ని సచివాలయాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో, ఇన్‌చార్జ్ ఈవో ప్రకాశ్‌నాయుడు తెలిపారు. కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదన



సమావేశంలో మున్సిపల్ చైర్మన్



మాట్లాడుతున్న కౌన్సిలర్

డోన్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా జరిగింది. వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు చేయగా.. పట్టణంలోని పలుచోట్ల ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన బంకులను తొలగించాలని టీడీపీ ప్రస్తుత ప్రభుత్వం కౌన్సిలర్లే నిలదీయడం ఆశ్చర్యానికి గురిచేసింది. పట్టణంలోని రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇబ్బందులు లేకుండా తాగునీరు ఇవ్వాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సభా దృష్టికి తీసుకవచ్చారు. సమావేశంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ, వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, కోఆప్షన్ మెంబర్ కుమ్మరి రాజు, సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

డోన్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశం కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ప్రసాద్ రెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 15వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రింటు తీసుకుని ఒరిజినల్స్‌తో వచ్చే నెల 17న మధ్యాహ్నంలోగా ఆయా ఐటీఐలలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈఅవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : జేసీ

శిరివెళ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : నిరంతర యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని పచ్చర్ల ఎకో టూరిజంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలకు చాటేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు యోగా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం చేకూరుతాయని జేసీ అన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, తహసీల్దార్ విజయశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షయ ప్రాణాంతకమైన వ్యాధి కాదు

చాగలమర్రి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): క్షయ ప్రాణాంతకమైన వ్యాధి కాదని, మందుల ద్వారా నయం చేసుకోవచ్చని అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి అన్నారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని మూడవ సచివాలయం పరిధిలో సంచార చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 2027 నాటికల్లా టీబీ వ్యాధి నిర్మూలనే లక్ష్యమన్నారు. టీబీ ముక్తి భారత్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా చక్కెర వ్యాధిగ్రస్థులు, తక్కువ బరువు ఉన్నవారు, ధూమపానం, మద్యపానం తాగేవారు, 60 సంవత్సరాలు పైబడిన వారికి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లాలో 26 కేసులు కొత్తగా నమోదయ్యాయని అన్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు అంజలి, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

రుద్రవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్రీజారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని హరినగరం చెంచుగూడెంలో చెంచులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరు మల్లేశ్వరమ్మ, ఎఎన్ఎం సరళకుమారి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్రీజారెడ్డి

దోమల నివారణకు పిచికారి

చాగలమర్రి: గ్రామాల్లో ప్రజలు మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి అన్నారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని చాగలమ్మ చెంచు కాలనీలో దోమల నివారణకు ఆల్ఫాసైపర్‌మెత్రిన్ ద్రావణం పిచికారి చేయించారు. కార్యక్రమంలో వైద్యురాలు అంజలి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, హెచ్ఈ వెంకటమ్మ, ఏఎన్ఎంలు మనోహర్, రాముడు, గార్లెట్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' జాబితాను సరి చేస్తున్నాం

చాగలమర్రి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' జాబితాను సరి చేస్తున్నామని ఎంఈవో అనూరాధ తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల తల్లికివందనం జాబితాలో తప్పులు దొర్లయాని అన్నారు. దీంతో కొంతమంది తల్లుల ఖాతాలో నిధులు జమ కాలేదన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు 25 వరకు సమయం కేటాయించారని అన్నారు. తల్లులందరికీ డబ్బులు జమ అవుతాయని ఎంఈవో తెలిపారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ ఆలయాభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన పిట్టల కిశోర్‌కుమార్, లక్ష్మి, రజనీశ్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ. 1.10లక్షలు గురువారం విరాళం అందించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి నగదును అందించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరస్వామి సన్నిధిలో బీసీ ఇందిరమ్మ

బనగాన పల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమా మహేశ్వరస్వామి వారిని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ గురువారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం బీసీ ఇందిరమ్మకు ఈవో బీ.చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, భరతుడు, శంఖేశ్వరరెడ్డి, మల్లేశ్‌రెడ్డి, రామశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ఆలయాభివృద్ధికి సీహెచ్ వెంకటరామయ్య అనే దివ్యాంగుడు బీసీ ఇంది రమ్మకు రూ.10వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా అతడిని అభినందించారు.



విరాళాన్ని అందిస్తున్న వెంకటరామయ్య

సమస్యల్లో సంక్షేమ హాస్టళ్లు

- కనీస సౌకర్యాలు కరువు
- కెపాసిటీకి మించి విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



హాస్టల్ ప్రాంగణంలోనే నిలిచివున్న మురుగునీరు



ఎస్సీ హాస్టల్‌లో డోర్లు లేని మరుగుదొడ్లు

డోన్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు కొట్టుమిట్టాడుతున్నాయి. గత వైసీపీ పాలకులు ఐదేళ్ల కాలంలో సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిపై దృష్టి సారించలేదు. దీంతో సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తిష్ట వేశాయి. డోన్ పట్టణంలో కొండపేట-బేతంచెర్ల రోడ్డులో బీసీ బాలుర సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. పట్టణంలోని రెవెన్యూ క్వార్టర్స్‌లోని షాదీఖానా వద్ద బీసీ బాలికల సంక్షేమ హాస్టల్, బీసీ బాలికల ఉన్నత పాఠశాల వెనుక ప్రాంతంలో ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్ ఉన్నాయి. బేతంచెర్ల రోడ్డులోని ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్ భవనం బలహీనంగా ఉండి శిథిలావస్థకు చేరుకుంటుంది. దీంతో వీటిలో విద్యార్థుల సంఖ్య వందకు మించి పెరగడం లేదు. బీసీ బాలుర సంక్షేమ హాస్టల్‌లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. వీటికి డోర్లు, నీరు లేకపోవడంతో కంపు కొడుతున్నాయి. ఎస్సీ హాస్టల్‌కు నిర్మిస్తున్న డైనింగ్‌హాలు పనులు ఇంతవరకు పూర్తి కాలేదు. రెవెన్యూ క్వార్టర్స్ షాదీఖానా వద్ద ఉన్న బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో గత విద్యాసం వత్సరమే 360 మందికి పైగా విద్యార్థినులు ఉన్నారు. ఈ విద్యాసంవత్సరం కూడా విద్యార్థినుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కెపాసిటీ మించి విద్యార్థులు ఉన్న ఈ హాస్టల్‌లో విద్యార్థినులకు సరిపడ బాత్‌రూమ్‌లు లేవని విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి పరచాలి



డోన్ సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి పరచాలి. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సౌకర్యాలు కల్పించాలి. విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలి.

- శివన్న, మహాజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, డోన్

పశువైద్యశాలలో వైద్యశిబిరం

దొర్నిపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గొర్రెలకు నీలి నాలుక వ్యాధి వచ్చే అవకాశం ఉందని గొర్రెల పెంపకం దారులు జాగ్రత్తగా ఉండాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య సూచించారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలకు నాలుక నీలి రంగులో మారి చెక్కిళ్లలో పుండ్లు పుడతాయని అన్నారు. అలాగే సొంగకూడా కారుతుందని, ఈ వ్యాధిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన గొర్రెల ప్రాణానికి ప్రమాదం అన్నారు. దీని నివారణకు ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్‌లు వేస్తున్నామని అన్నారు. పశువైద్యశాలలో ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పశువైద్యాధికారి చిన్నబాబు, సిబ్బంది ఉన్నారు.